## బిఆర్ఎస్ మేనిఫెస్టోతో బిజెపి, కాంగ్రెస్‌లు ఢీలా పడ్డాయి

- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణారావు



మానకొండూర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): బిఆర్ఎస్ మేనిఫెస్టోతో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఢీలా పడ్డాయని బిఆర్ఎస్ జిల్లా అధ్య క్షులు జివి రామకృష్ణారావు వ్యాఖ్యానించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ప్రకటించిన బిఆర్ఎస్ మేనిఫెస్టో ప్రజాకర్షక హామీలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ వంద సీట్లు గెలవడం ఖాయమన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే గా రసమ యి బాలకిషన్ ను భారీ మెజారిటీతో గెలుపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి కేసీఆర్ నెరవేరుస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు జెడ్పిటిసి సభ్యులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, స్థానిక సర్పంచ్ రొడ్డ పృధ్విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న శ్రీనివాస్



వేములవాడ, అక్టోబర్ 16 (మనం న్యూస్): శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తోన్న దేవి నవరాత్రుల సందర్భంగా ఆలయ మాజీ చైర్మన్ ఆది శ్రీనివాస్ సోమవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణం జరిగి ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు సంఘ స్వామి యాదవ్, కనికరపు రాకేష్, సూగురి సుధాకర్, వస్తాది కృష్ణ, గుర్రం తిరుపతి, పిట్టల గంగాధర్, ఖమ్మం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో ఇంటింటికి కాంగ్రెస్



సిరిసిల్ల అర్బన్, అక్టోబర్ 16 (మనం న్యూస్): సిరిసిల్ల నియోజకవర్గంలోని లక్ష్మీపూర్, పాపయ్యపల్లి గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ మునిగెల రాజు ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ అమలుపరచనున్న ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోను బిఆర్ఎస్ పార్టీ కాపీ కొట్టి చంక లు గుద్దుకుంటోందని విమర్శించారు. బ్లాక్ అండ్ వైట్ సినిమాను కలర్‌లో చూపించినట్లుగా బిఆర్ఎస్ మెనిఫెస్టో ఉందని ఎద్దేవా చేశారు. పది సంవత్సరాలుగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు కొత్త హామీలపేరిట మరోసారి ప్రజలను మోసగించే యత్నాలు సాగిస్తున్నారన్నా రు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరని... కాంగ్రెస్ పార్టీ వైపు అందరూ చూస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకునే సమయం ఆసన్న మైందని.. కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి వెంకట్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, రైతు సెల్ అధ్యక్షుడు పొన్నాల పర్శరాం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేశం, లక్ష్మీరాజం,సుద్దాల శ్రీనివాస్,ఎన్ఎస్‌యుఐ అధ్య క్షుడు సాయి ప్రసాద్, మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ళ భరత్ గౌడ్,యూత్ మండల అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్, మందటి తిరుపతి యాదవ్, బాలసాని తిరుపతి, అరెపెల్లి బాలు, చందు, శ్యామ్, తిరుపతి, మల్లేషం, ప్రశాంత్, రాజేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిరిసిల్లకు కెసిఆర్



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 16 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి కెసి ఆర్ మంగళవారం పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొననున్నారు. పార్టీ మేనిఫెస్టో ప్రకటించిన అనంతరం మొట్టమొదటి సారి సిరిసిల్లకు రానుండడం, ఈ నియోజకవర్గంలో ఆయన తనయుడు, మంత్రి కెటిఆర్ బరిలో ఉండడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# పబ్లిక్ ప్రదేశాల్లో బ్యానర్లు, వాల్ రైటింగ్‌లు ఉండరాదు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గోపి



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 16 (మనం న్యూస్): ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పబ్లిక్ ప్రదేశాల్లో బ్యానర్లు, వాల్ రైటింగ్ లు లేకుండా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి. గోపి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సిపి తో కలిసి ఆర్వోలు, ఇతర ఎన్నికల నోడల్ అధికారులకు ఎన్నికల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున జిల్లాలోని పబ్లిక్ ప్రదేశాలలో ఎక్కడ కూడా బ్యానర్లు గాని, వాల్ రైటింగ్ లు గాని లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఇప్పటికి తొలగించకుండా ఉన్నట్లు దృష్టికి వచ్చినట్లయితే పంచాయితి సెక్రటరీలు, మున్సిపల్ అధికారులపై ఎన్నికల ప్రవర్తన నియావళి ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్ 12 బి కొరకు అవసరమైన శాఖలన్నింటిని వినియోగించుకోవడం జరుగుతుందని తెలిపారు. సెక్టరోల్ అధికారులకు ఎన్నికల సామాగ్రిపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధుల కొరకు అన్ని శాఖలలోని ఒప్పంద ఉద్యోగులు, పంచాయితి సెక్రటరీల వివరాలను పంపించాలని ఆదేశించారు. జిల్లాలోని 50శాతం పోలింగ్ కేంద్రాలలో లైవ్ వెబ్ కాస్టింగ్ నిర్వహించడం జరుగుతుందని, మిగిలిన పోలింగ్ కేంద్రాలలో సిసి టివి, వీడియో రికార్డింగ్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, విద్యూత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ఆర్వోలు ప్రత్యక్షంగా పరిశీలించాలని, సెక్టోరల్ అధికారులు కూడా పరిశీలించి నివేదికలను సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఎన్నికల కొరకు జిల్లాకు వచ్చే జనరల్ అబ్జర్వర్ లు, వ్యయ పరిశీలకులు మరియు పోలీస్ పరిశీలకుల కొరకు కావలసిన ఏర్పాట్లను ముందుస్తుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి నియోజక వర్గం వారిగా రూట్ మ్యాప్ లను సిద్దం చేసుకోవాలని, ఎన్నికల కొరకు అవసరమయ్యే వాహనాలను ముందుగానే సమ కూర్చుకోవాలని, ప్రతి పోలింగ్ కేంద్రం వారిగా వికలాంగుల కొరకు 2 వీల్ చైర్లు మరియు ఇద్దరు వాలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగించిన వారిపై చర్యలు తీసుకోవడంలో అలస్యం జరగరాదని, వారిపై ఎఫ్.ఐ.ఆర్. ను నమోద చేయాలని సూచించారు. 1950 కాల్ సెంటర్, సువిధ యాప్ లలో వచ్చే సమస్యలను గురించి ప్రతిరోజు రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. సిపి సుబ్బారాయుడు మాట్లాడుతూ అనుమతి పొందిన వాహనాల ద్వారానే క్యాంపెయిన్ నిర్వహించేలా చూడాలని, ఎన్నికల ప్రవర్తన నియావళి పై అవగాహన కల్పించాలని, నామినేషన్ ను వీడియో రికార్డింగ్ చేయాలని, బారికేడ్లను ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డిఓలు కె. మహేశ్వర్, రాజు, ఎసిపి విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ హామీలన్నీ మోసపూరితమే

- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోజిరెడ్డి




కరీంనగర్, అక్టోబర్ 16 (మనం న్యూస్): బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ మోసపూరితమైన వని తెలంగాణ ప్రజల్ని మరోసారి మోసం చేసే హామీలు ఇచ్చారని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014, 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మరోసారి ప్రజల్ని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు ఇక మోసపోరని బిఆర్ఎస్ నాయకులకు కర్రు కాల్చి వాత పెడతారన్నారు. 2014 నుండి కేసీఆర్ సీఎంగా ఉండి చేయలేని పనులన్నీ ఇప్పుడు చేస్తామంటే ప్రజలు నమ్మరన్నారు. నిరుద్యోగ భృతి హామీ ఏమైపోయిందని ప్రశ్నించారు. నిజాయితీగా ప్రజలకు సేవ చేయడానికి కేసీఆర్ సుముఖంగా లేడని స్పష్టమవుతుందన్నారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి ఇంతవరకు దాని ఊసే లేదన్నారు. కెసిఆర్ తెలంగాణ ప్రజలకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదు కాబట్టే ఉచిత పథకాలు నమ్ముకొని ఎన్నికలకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. రేషన్ కార్డు ఉన్నవారికి ఉచితాలు ప్రకటించడం పక్కన పెట్టి కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిన పరిస్థితి కనిపిస్తుందన్నారు. తెలంగాణ వస్తే కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ డైలీ వేజ్ ఉద్యోగాలు ఉండవని అన్ని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయని దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందని జోజిరెడ్డి విమర్శించారు. అనేక ఆశలతో,ఆకాంక్షలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు దోపిడీకి గురవుతున్నారని అన్నారు. గతంలో ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని కేజీ టు పీజీ ఉచిత విద్య, ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్, నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, రైతులకు ఎరువులు, పురుగుమందులు ఉచితంగా సరఫరా, నిరుద్యోగ భృతి, 57 సంవత్సరాలకే పెన్షన్ ,కొత్త రేషన్ కార్డుల పంపిణీ,ఇలా అనేక వాగ్దానాలు నెరవేర్చలేదన్నారు. రైతుబంధు ఇచ్చి సబ్సిడీలు పూర్తిగా తొలగించారని, దరణి పోర్టల్ తీసుకొచ్చి రైతాంగానికి మరింత ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పెట్టుబడి సహాయం సేద్యం చేస్తున్న రైతులకు ఇవ్వకుండా సేద్యం చేయని రైతులకు లక్షల రూపాయలు ఇస్తున్నారని, రియల్ ఎస్టేట్ భూములకు, పంటలు పండని నిరుపయోగంగా ఉన్న భూములకు రైతు బంధు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. కౌలు రైతులకు రైతుబంధు వర్తింపజేయడంలో కేసీఆర్ సర్కార్ పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా వేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. జిల్లాలో అనేక బీసీ ఎస్సీ ఎస్టీ వసతి గృహాలు అద్దె భవనాల్లోనే ఉన్నాయని పక్కా భవనాలు కట్టించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కుటుంబాల సంఖ్య పెరిగిపోయిందని, అనేక పెళ్లిళ్లు జరిగాయని వారందరికీ రేషన్ కార్డులు లేకపోవడం మూలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వైద్యం ఖరీదుగా మారిపోయిందని, కార్పొరేట్ వైద్యాన్ని నియంత్రించాల్సింది పోయి మరింత పెంచి పోషిస్తున్నారన్నారు. అకాల వర్షాల వల్ల జిల్లాలో 50వేల ఎకరాల్లో పంట పూర్తిగా నష్టం జరిగితే స్వయంగా ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పర్యటించి ఎకరానికి 10వేలు నష్టపరిహారం అందజేస్తామని ప్రకటించినప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడం రైతుల పట్ల బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందని జోజిరెడ్డి వ్యాఖ్యానించారు. బతుకు తెలంగాణ కోసం సకలవర్గాలు, సబండ వర్గాలు ఏకమై ఐక్యంగా రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## కరీంనగర్‌లో రూ.2.36 కోట్ల నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబర్ 16 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఒక వాహనంలో తరలిస్తోన్న రెండు కోట్ల 36 లక్షల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల సందర్భంగా సోమవారం నగరంలోని కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ వద్ద ఇన్స్పెక్టర్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైటర్ సేఫ్ గార్డు ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన టిఎస్ 09 యుడి 5198 వ్యాన్‌లో 2.36 కోట్ల రూపాయలను గుర్తించారు. దీనికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల నియమావళి ప్రకారం స్వాధీన పరుచుకుని, స్థానిక రిటర్నింగ్ అధికారి, ఆదాయ పన్నుశాఖ అధికారులకు సమాచారమందించారు. తదుపరి చర్యల నిమిత్తం రిటర్నింగ్ అధికారి సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీకి ఆ సొమ్మును అప్పగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కె.మహేశ్వర్, టౌన్ ఎసిపి నరేందర్, టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె.రాంచందర్ రావు, ఎస్సై చీనా నాయక్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, కానిస్టేబుల్ రవీందర్, మల్లయ్య ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపిని గెలిపించి అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేయాలి

- మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్



శంకరపట్నం, అక్టోబర్ 16 (మనం న్యూస్): ప్రజలు రాబోయే ఎన్నికల్లో బిజెపిని గెలిపించి, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి బాటలు వేయాలని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం కొత్త గట్టు గ్రామంలో శ్రీమత్స్య గిరీంద్ర స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే అరెపల్లి మోహన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల బిజెపి అధ్యక్షులు ఏనుగుల అనిల్‌తో కలిసి కొత్త గట్టులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా కేశవపట్టణం మండల ప్రజలు కమలం గుర్తుకు ఓటు వేసి ఆశీర్వ దించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, 24 గంటల పాటు ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డట్లు గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను దోచు కుంట్టున్నారని ఆరోపించారు. రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలో అవినీతి పాలన అంతమొందాలంటే రాబోయే ఎన్నికల్లో బిజెపికి ఓటు వేసి గెలిపించాలని మోహన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి ఆలివెలి సమ్మిరెడ్డి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగా జైపాల్, దొంగల రాములు, మండల నాయకులు ఉమెంతల ఇంద్రాసేనారెడి, ప్రధాన కార్యదర్శి కొయ్యడ అశోక్, దాసరపు నరేందర్, మండల ఉపాధ్యక్షులు సుధగోని శ్రీనివాస్ గౌడ్, నాయకులు పెసరి అర్జున్, గొరవేని శ్రీనివాస్, సాగి బద్రా రావు, మాడ చొక్కా రెడ్డి ,కొరెం ఆదిరెడ్డి ,పడిపల్లి సదానందం, రామగిరి సంపత్, అంబల సురేశ్, కోడూరి నరేశ్, మోరే సమ్మయ్య, నూనె కొండల్ రెడ్డి, మడ్డి సంతోష్, తీగల రేమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చందర్‌కు బి ఫారం అందించిన కెసిఆర్



గోదావరిఖని, అక్టోబర్ 16 (మనం న్యూస్): రాష్ట్ర ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కెసిఆర్ సోమవారం హైదరాబాదు ప్రగతి భవన్‌లో రామగుండం ఎమ్మెల్యే బిఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్‌కు బి ఫారంను అంది ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చందర్ ముఖ్య మంత్రి కెసిఆర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రవళికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే


- బిఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి విజయ్‌కుమార్



వెల్గటూర్,అక్టోబర్ 16 (మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వ అసమర్థ పాలన, నిర్లక్ష్యంతోనే మర్రిపల్లి ప్రవళిక అనే నిరుద్యోగ యువతి ఆత్మహత్య చేసుకుందని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని ధర్మపురి నియోజకవర్గ ఇంచార్జి నక్క విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. సోమవారం మండలంలోని రాజరాంపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే విద్యార్థుల ఆత్మ బలిదానాలతో అని అలాంటి విద్యార్థుల కళలను సాకారం చేయడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తొమ్మిదేళ్లలో వేసిన ఒకే ఒక్క గ్రూప్ 1నోటిఫికేషన్ ను కూడా రెండుసార్లు రద్దు చేశారని,ఇది ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని దుయ్యబట్టారు. టీఎస్పీఎస్సీ ని పూర్తిగా రద్దుచేసి సీఎం బంధువులను తొలగించి పూర్తిగా ప్రక్షాళన చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రవళిక ఆత్మహత్యను ప్రేమగా ముడి వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో లేని ఫోన్ల తనిఖీ ప్రవళిక కేసులో అత్యుత్సాహం ప్రదర్శించి డిఎస్పీ బహిరంగపరచడం హక్కుల ఉల్లంఘన కిందే వస్తుందని తక్షణమే డిఎస్పీని తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ ముఖ్యమంత్రిగా చెప్పుకునే కేటీఆర్ ప్రవళిక అసలు గ్రూప్ ఎగ్జామ్ కి దరఖాస్తు చేయలేదని చెప్పడం అతని రాజకీయ పరిణతి కి నిదర్శనమని,ప్రవళిక గ్రూప్ ఎగ్జామ్ దరఖాస్తులను మీడియా ముందు ప్రదర్శించి ఇది తండ్రి కొడుకుల అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు.ప్రవళిక కుటుంబానికి న్యాయం జరిగే వరకూ బీఎస్పీ పార్టీ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు కుశనపెల్లి శ్రీనివాస్,నియోజకవర్గ మహిళా నాయకులు షాహీనా బేగం,కొతూరి మనీష,ఎండపల్లి మండల అధ్యక్షులు తడగొండ కార్తీక్,పెగడపల్లి మండల అధ్యక్షులు నక్క గంగాధర్,ధర్మారం మండల అధ్యక్షులు గొడుగు అనిల్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కోతూరి శంకర్,రాజరంపల్లి గ్రామ అధ్యక్షులు సాయి కుమార్,నాయకులు బిరుదుల స్వామి,నరేష్,రవి,శైలేందర్,చెన్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాలకు ముసుగులు సరికాదు

- మాల మహానాడు జిల్లా అధ్యక్షులు శ్రీహరి



జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 16(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు ముసుగులు వేయడం సరికాదని మాల మహా నాడు జిల్లా అధ్యక్షులు మ్యాదరి శ్రీహరి అన్నారు. జిల్లాలోని అంబేద్కర్ విగ్రహాలకు ముసుగులు తొలగించాలని కోరుతూ సోమవారం శ్రీహరి ఆధ్వర్యంలో దళిత బహుజన సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన అధికారి, ముసుగు తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ అమెరికా, లండన్ లాంటి దేశాలలో అంబేద్కర్‌కు ఎనలేని గుర్తింపు ఉందని, కానీ మన భారత దేశంలో రాజ్యాంగం రాసిన వ్యక్తికి ఎన్నికల పేరిట ముసుగులే వేయడం సరికాదన్నారు. రాజ్యాంగ హక్కుల ప్రకారం ఓటు సీట్ల కొరకు ఆరాట పడుతున్న రాజకీయ పార్టీల నాయకులు ఈ వ్యవహారాన్ని ఖండించ కపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు వేల్పుల ప్రవీణ్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్, అధ్యక్షురాలు లక్ష్మి, ముదిరాజ్ సం ఘం జిల్లా అధ్యక్షులు పులి నరసయ్య, ఆల్ ఇండియా జిల్లా అధ్యక్షులు కారంగుల వసంతరావు, అంబేద్కర్ సంఘం కోరుట్ల డివిజన్ అధ్యక్షులు ఉయ్యాల శోభన్, భూపెల్లి నగేష్, తెలంగాణ కారు డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కోడిపెల్లి అనిల్, మల్లాపూర్ మండల అధ్యక్షులు జంగం దినేష్, మాల మహానాడు పట్టణ అధ్యక్షులు కడమండ కమలాకర్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జల రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఇంగ్లండ్ బౌలింగ్‌లో వాళ్లిద్దరూ వేస్ట్.. ఇలా అయితే టోర్నీలో కష్టమే..!

ఆఫ్ఘన్ చేతిలో దారుణంగా ఓడిన డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్ ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. అసలు ఆఫ్ఘన్ చేతిలో ఇంగ్లండ్ ఓడిపోవడానికి కారణాలేంటని వెతికేపనిలో విశ్లేషకులున్నారు. ఇదే టైంలో కామెంటేటర్ ఆకాష్ చోప్రా ఇంగ్లండ్ జట్టుపై విరుచుకుపడ్డాడు. ఇంగ్లండ్ ఓటమికి బౌలర్లే కారణమంటూ ఇద్దరు బౌలర్లని టార్గెట్ చేశాడు ఆకాష్. ఆకాష్ చోప్రా తన యూట్యూబ్ చానల్లో ఇంగ్లండ్ ఓటమి గురించి విశ్లేషించాడు. 'ఇంగ్లండ్ టాస్ గెలిచిన తర్వాత బౌలింగ్ ఎంచుకోగానే నేను చాలా ఆశ్చర్యపోయాను. అది చిన్న గ్రౌండ్. పిచ్ కూడా ఫ్లాట్‌గా ఉండి పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించేలా ఉంది. అయితే బౌలింగ్ ఎంచుకోవడానికి పిచ్‌పై మంచు కురిసే అవకాశం ఉండడమేనని ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ చెప్పాడు. కానీ అదే ప్పి భారత్ సెకండ్ బ్యాటింగ్ చేసినప్పుడు మంచు ప్రభావం పెద్దగా కనిపించలేదు. మరి ఇంగ్లండ్ బౌలింగ్ ఎందుకు ఎంచుకుందో అర్థమే కాలేద'న్నాడు. అలాగే ఈ ప్పి ఇంగ్లండ్ లాంటి డెప్త్ బ్యాటింగ్ లైనప్ ఉన్న జట్టు మొదట బ్యాటింగ్ చేసి ఉంటే కనీసం 350 నుంచి 400 పరుగులు చేసే అవకాశం ఉండేదని ఆకాష్ చెప్పుకొచ్చాడు. దానికి తోడు ఇంగ్లండ్ బౌలింగ్ లైనప్ ఆఫ్ఘన్ బ్యాటర్ల ముందు తేలిపో యింది. రీస్ టాప్లే ఒక్క మ్యాచ్‌లో బాగా ఆడాడు. క్రిస్ వోక్స్, శామ్ కర్రాన్ సగం సగం బౌలర్లలా కనిపించార న్నాడు. మార్క్ వుడ్ బాగా బౌలింగ్ చేసినా ఆశించినంతగా రాణించలేదు. ఇక స్పిన్ విభాగంలో కేవలం ఒకే ఒక్క లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్‌తో ఇంగ్లండ్ బరిలోకి దిగడాన్ని కూడా ఆకాష్ తప్పుబట్టాడు. లియామ్ లివింగ్‌స్టోన్ 10 ఓవర్లు వేయగలిగే బౌలర్ అని, జో రూట్ కూడా ఎక్కువ ఓవర్లు వేయగలడు. కానీ వీటన్నింటినీ ఉపయోగించుకోవడంలో ఇంగ్లండ్ పూర్తిగా ఫెయిల్ అయిందని, ఇంగ్లండ్ ఓటమికి బౌలింగే కారణమని ఆకాష్ కంక్లూడ్ చేశాడు.

# ఫిట్‌నెస్ టెస్టులే లేవు.. ఎలా గెలుస్తారు?
# పాక్ జట్టుపై వసీం అక్రమ్ షాకింగ్ కామెంట్స్



ఫిట్నెస్ టెస్టులే లేవు.. ఎలా గెలుస్తారు? పాక్ జట్టుపై వసీం అక్రమ్ షాకింగ్ కామెంట్స్ బాబర్ ఆజమ్ సారథ్యంలోని పాకిస్తాన్ క్రికెట్ జట్టుపై దిగ్గజ పేసర్ వసీం అక్రమ్ సంచలన ఆరోపణలు చేశాడు. అసలు పాక్ టీమ్లో ఫిట్నెస్ టెస్టు అనేదే నిర్వహించడం లేదని ఆరోపించాడు. భారత్తో మ్యాచ్లో ఫీల్డ్‌లో పాక్ ఆటగాళ్ల ఆట చూశాక అక్రమ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్తో మ్యాచ్లో దారుణ పరాజయం తర్వాత అక్రమ్ ఓ టీవీ ఛానెల్ వేదికగా స్పందిస్తూ.. 'ఈ జట్టు ఆటగాళ్ల ఫిట్నెస్ట్పీ నాకు ఆందోళనగా ఉంది. ప్రస్తుతం పాక్ టీమ్లో ఫిట్నెస్ టెస్టు లేదు. మిస్బా ఉల్ హక్ సారథిగా ఉన్నప్పుడు యో-యో టెస్టుతో ఇతర ఫిట్నెస్ టెస్టులను రెగ్యులర్గా నిర్వహించేవాళ్లు. ప్రొఫెషనల్ క్రికెటర్ తప్పకుండా నెలకు ఒకసారి అయినా ఫిట్నెస్ టెస్టులో పాల్గొనాలి. అలా చేయకుంటే మీకు ఇలాంటి ఫలితాలే (భారత్‌తో మ్యాచ్లో ఓటమిని ప్రస్తావిస్తూ) ఎదురవుతాయి..'అని అన్నాడు. అంతేగాక అక్రమ్ పాకిస్తాన్ క్రికెట్ మేనేజ్మెంట్పైనా విమర్శలు గుప్పించాడు. 'గత మూడేండ్లలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు ముగ్గురు ఛైర్మన్లు మారారు. దీంతో ఆటగాళ్లలో కూడా అభద్రతాభావం పెరిగింది. తర్వాత సిరీస్లో మేం ఆడతామో లేదో అన్న భావన ఆటగాళ్లలో ఉంది. భారత్‌తో మ్యాచ్లో 154-2గా ఉన్న స్కోరు ఉన్నఫళంగా 191 పరుగులకే ఆలౌట్ అవడం చాలా నిరాశపరిచింది..' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. అహ్మదాబాద్ వేదికగా రెండ్రోజుల క్రితం భారత్ - పాక్ మధ్య జరిగిన మ్యాచ్లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్.. 42.5 ఓవర్లలో 191 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం భారత్.. లక్ష్యాన్ని మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి మరో 20 ఓవర్లు మిగిలుండగానే ఛేదించింది. ఈ విజయంతో భారత్.. వన్డే ప్రపంచకప్లో పాకిస్తాన్‌పై ఆధిక్యాన్ని 8-0కు పెంచుకుంది.

# అధికారిక పోస్టర్ రిలీజ్.. కోహ్లీపై ప్రశంసలు!



న్యూఢిల్లీ: నాలుగేళ్లకు ఒకసారి యావత్ క్రికెట్ ప్రపంచం పోటీ పడే ఒలింపిక్స్లో క్రికెట్కు చోటు దక్కింది. ఇటీవలే ఈ ప్రతిపాదనపై ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ(ఐఓసీ) ఆమోదం తెలపగా.. తాజాగా ఐఓసీ సదస్సులో ఓటింగ్ నిర్వహించారు. ఐఓసీలోని ఇద్దరు సభ్యులు మాత్రమే క్రికెట్ను వ్యతిరేకించగా.. మిగిలిన వారంతా అనుకూలంగా ఓటేసారు. ముంబైలోనే ఐఓసీ సదస్సు జరగడం విశేషం. ఐఓసీ సభ్యుల ఆమోదం కూడా లభించడంతో క్రికెట్ ఒలింపిక్స్లో భాగమైనట్లు అధికారిక పోస్టర్ రిలీజ్ చేశారు. ఐదు క్రీడలను చేర్చాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించిందని ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్ కూడా ప్రకటించారు. అయితే 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ నుంచి టీ20 ఫార్మాట్లో క్రికెట్ మ్యాచ్లు నిర్వహించనున్నారు. క్రికెట్ (టీ20)తో పాటు బేస్ బాల్- సాఫ్ట్ బాల్, ఫ్లాగ్ ఫుట్బాల్, లక్రాస్ (సిక్సస్), స్క్వాష్లకు కూడా ఒలింపిక్స్లో అవకాశం కల్పించారు. ఇక ఐఓసీ విడుదల చేసిన పోస్టర్లో క్రికెట్ ఐకాన్గా టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఫోటోను ఉపయోగించారు. లాస్ ఏంజెల్స్ 2028 ఒలింపిక్స్ నిర్వాహకులు విరాట్ కోహ్లీపై ప్రశంసల జల్లు కురిపించారు. విరాట్ కోహ్లీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని ఓ ఆర్గనైజర్ వెల్లడించాడు. 'సోషల్ మీడియాలో విరాట్ కోహ్లీకి 340 మిలియన్ల ఫాలోవర్స్ ఉన్నారు. ప్రపంచంలోనే అత్యధిక ఫాలోవర్లు కలిగిన మూడో అథ్లెట్ అతను. అతను ఇప్పటికే టైగర్ వుడ్స్, లీబ్రోన్, టామ్ బ్రాడీలను వెనక్కునెట్టాడు.'అని సదరు ఆర్గనైజర్ చెప్పుకొచ్చాడు. తాజా నిర్ణయంతో 148 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్లోకి క్రికెట్ రీఎంట్రీ ఇవ్వబోతుంది. చివరి సారిగా 1900 ఒలింపిక్స్లో క్రికెట్ భాగంగా ఉంది. అదే తొలిసారి, చివరిసారి కూడా. అప్పుడు డెవాన్ అండ్ సోమర్సెట్ వండరర్స్ క్లబ్ (బ్రిటన్), ఫ్రెంచ్ అథ్లెటిక్ క్లబ్ యూనియన్ (ఫ్రాన్స్) మధ్య రెండు రోజుల మ్యాచ్ నిర్వహించారు. అయితే ఈ మ్యాచ్లో ఒక్క జాతీయ ఆటగాడూ లేకపో వడంతో పాటు జట్టుకు 12 మంది చొప్పున ఆటగాళ్లు ఆడారు. దాంతో ఈ మ్యాచ్కు ఫస్ట్క్లాస్ హోదా కూడా దక్కలేదు. తొలి ఇన్నింగ్స్లో బ్రిటన్ 117 పరుగులు చేయగా.. ఫ్రాన్స్ 78 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్లో 145/5 వద్ద బ్రిటన్ డిక్లేర్ చేసింది. ఛేదనలో ఫ్రాన్స్ 26 పరుగులకే కుప్పకూలడంతో బ్రిటన్ 158 పరుగుల తేడాతో నెగ్గింది. అప్పుడు బ్రిటన్కు రజతం, ఫ్రాన్స్కు కాంస్యం అందించారు. ఆ తర్వాత వీటిని పసిడి, రజత పతకాలుగా మార్చారు.

# పాక్ కొంపముంచిన బాబర్ ఆజామ్ కక్కుర్తి!



న్యూఢిల్లీ: పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజ్మా టీమిండియా మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ ఘాటు విమర్శలు చేశాడు. భారత్తో జరిగిన మ్యాచ్లో బాబర్ ఆజామ్ హాఫ్ సెంచరీ కోసం కక్కుర్తి పడ్డాడని మండిపడ్డాడు. వ్యక్తిగత రికార్డు కోసం అతను నెమ్మదిగా బ్యాటింగ్ చేయడం పాకిస్థాన్ ఓటమిని శాసించిందని అభిప్రాయపడ్డాడు. వన్డే ప్రపంచకప్ 2023లో భాగంగా భారత్తో గత శనివారం జరిగిన మ్యాచ్లో పాకిస్థాన్ 7 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడిన విషయం తెలిసిందే. ఈ గెలుపుతో వన్డే ప్రపంచకప్లో పాకిస్థాపై టీమిండియా ఆధిపత్యం 87-0గా మారింది.

తాజాగా అధికారిక బ్రాడ్ కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన గంభీర్.. పాకిస్థాన్ ఘోర పరాజయాన్ని విశ్లేషించాడు. బాబర్ ఆజామ్ స్వార్థపూరిత బ్యాటింగే ఆ జట్టు విజయవకాశాలను దెబ్బ తీసిందని తెలిపాడు. 'బాబర్ ఆజామ్ పిరికివాడు. భాగస్వామ్యం నెలకొల్పే క్రమంలో ఇద్దరు బ్యాటర్లు నెమ్మదిగా ఆడవద్దు. ఒకరు ధాటిగా ఆడితే మరొకరు యాంకర్ రోల్ పోషించాలి. కానీ బాబర్, రిజ్వాన్ చాలా స్లోగా బ్యాటింగ్ చేశారు. రిజ్వాన్ కంటే ముందు బ్యాటింగ్కు వచ్చిన బాబర్ ఆజామ్ అటాకింగ్ గేమ్ ఆడాల్సింది. కానీ అతను హాఫ్ సెంచరీ చేసుకోవాలనే ఆలోచనతో నెమ్మదిగా ఆడాడు. దాంతో పాకిస్థాన్కు ఘోర పరాజయం తప్పలేదు. వ్యక్తిగత రికార్డుల కోసం ఆడితే ఇలాంటి ఫలితాలే ఎదురవుతాయి. వరల్ క్లాస్ బ్యాటర్ అయిన బాబర్ ఆజామ్ చెత్త షాట్ ఆడబోయి వికెట్ పారేసుకున్నాడు. అప్పటికే 60 బంతులు ఆడి 50 పరుగులు చేసి కూడా అలాంటి షాట్ ఆడటం దారుణం. అతను ఔటైన బంతి పెద్దగా బౌన్స్ కూడా అవ్వలేదు. లెంగ్త్ బాల్ కూడా కాదు. పంచ్ షాట్ ఆడకుండా లెట్ కట్ ఆడబోయి వికెట్ పారేసుకున్నాడు. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్లో బాబర్ ఆజామ్ చాలా పరుగులు చేశాడు. ఎన్నో ఘనతలను అందుకున్నాడు. కానీ మునపటి పాకిస్థాన్ బ్యాటర్లలా మాత్రం నిర్భయంగా ఆడటం లేదు. గత పాకిస్థాన్ జట్టులో షాహిద్ అఫ్రిది, ఇమ్రాన్ నజీర్, తౌఫిక్ ఊమర్ దూకుడుగా బ్యాటింగ్ చేసవారు. ప్రస్తుత జట్టు టాప్ ఆర్డర్లో ప్రత్యర్థిపై విరుచుకుపడే బ్యాటర్ ఒక్కరు కూడా లేరు. టాప్ క్వాలిటీ బౌలింగ్ అటాక్ను ఎదుర్కొంటున్నప్పుడు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఆడాలని డ్రెస్సింగ్ రూమ్లో చర్చించుకోవాలి. 150 పరుగులకే ఔటైనా.. ఏ మాత్రం భయపడకుండా బ్యాటింగ్ చేయాలి. టాప్-3 త్వరగా ఔటైనా.. నెంబర్ 4-5 బ్యాటర్లు జట్టును ఆదుకుంటారు.'అని గంభీర్ చెప్పుకొచ్చాడు.




మనం సినిమా manamcinema

## ప్రతి సీన్ గొప్పగా అనిపిస్తుంది - రవితేజ



మాస్ మహారాజ్ రవితేజ హీరోగా టైగర్ నాగేశ్వరరావు బయోపిక్ రాబోతుంది. ఇండియన్ రాబిన్ హుడ్ గా పేరుగాంచిన స్టువర్ట్ పురానికి చెందిన వ్యక్తినే ఈ 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ సినిమా ఈ నెల 20వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంటును హైదరాబాద్ 'శిల్పకళావేదిక'లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ వేదికపై రవితేజ మాట్లాడుతూ .. ఈ సినిమాలో ప్రతి సీన్ చాలా గొప్పగా అనిపిస్తుంది .. అందుకు కారణం 'మధి' ఫొటోగ్రఫీ. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం నెక్స్ట్ లెవెల్‌కి తీసుకుని వెళుతుంది. డైలాగ్స్‌ను విపరీతంగా ఎంజాయ్ చేస్తారు అని చెప్పాడు. అలాగే రేణు దేశాయ్ గురించి రవితేజ మాట్లాడుతూ.. రేణు దేశాయ్ గారు చాలా కాలం తరువాత కమ్ బ్యాక్ ఇచ్చారు. ఒరిజినల్ కేరక్టర్‌కి చాలా దగ్గరగా ఆమె కనిపిస్తారు. ఆ పాత్రకి ఆమె చాలా కరెక్టుగా సరిపోయారు. ఆమె పాత్ర సినిమాకి హైలైట్‌గా నిలుస్తుంది. డైరెక్టర్ వంశీ గురించి మాత్రం రిలీజ్ తర్వాత మాట్లాడతాను అంటూ రవితేజ ముగించాడు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.



## ఆ నిర్ణయం నాకు ఎంతో ఇంపార్టెంట్



'టైగర్ నాగేశ్వరరావు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో రేణు దేశాయ్ మాట్లాడిన మాటలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. రేణు దేశాయ్ ఈ సినిమాలో ముఖ్యమైన పాత్రను పోషించింది. ఈ సందర్భంగా రేణు దేశాయ్ మాట్లాడుతూ .. నేను సినిమా ఇండస్ట్రీకి వచ్చి దాదాపు 23 ఏళ్లు అయింది. అయినా నాకు మాత్రం 'బద్రీ' ఈ మధ్యనే రిలీజ్ అయిందనే ఫీలింగ్ ఉంది. ఇంతకాలంగా నేను తెలుగు సినిమాలు చేయకపోయినా, మీరంతా నా పై అదే ప్రేమను చూపిం చారు. ఈ సినిమాలో నాకు ఛాన్స్ ఇచ్చిన దర్శక నిర్మాతలకు నేను థ్యాంక్స్ చెబుతున్నాను అని రేణు దేశాయ్ చెప్పుకొచ్చారు. రేణు దేశాయ్, రవితేజ గురించి కూడా మాట్లాడుతూ.. 'రవితేజగారి వంటి సీనియర్ స్టార్ తో కలిసి పనిచేయడం ఆనందంగా అనిపిస్తోంది. రవితేజ తీసుకున్న నిర్ణయం నాకు ఎంత ఇంపార్టెంట్ అనేది ఆయనకు తెలియదు. ఈ వేదిక ద్వారా .. పర్సనల్ గాను రవితేజ గారికి థాంక్స్ చెబుతున్నాను' అని రేణు దేశాయ్ ఎమోషనల్ కామెంట్స్ చేసింది. ఇండియన్ రాబిన్ హుడ్ గా పేరుగాంచిన స్టువర్ట్ పురానికి చెందిన వ్యక్తినే ఈ 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ సినిమా ఈ నెల 20వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది. అభిషేక్ అగర్వాల్ ఆరట్స్ బ్యాన్ప అభిషేక్ అగర్వాల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

ఇప్పుడు కుర్రకారు జపం చేస్తున్న పేరేదైనా ఉందా..? అంటే ఒక్క క్షణం ఆలోచించకుండా చెప్పే పేరు మృణాల్ఠాకూర్. ఈ మరాఠీ ముద్దుగుమ్మ లవ్ సోనియా సినిమాతో సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది. 2022లో సీతారామం చిత్రంలో సీతామహాలక్ష్మి (ప్రిన్సెస్ నూర్ జహాన్) పాత్రకు ప్రాణం పోసి.. తెలుగులో కూడా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకుంది. ట్రెండీ డ్రెస్‌లోనైనా, చీరకట్టులోనైనా మృణాళ్ ఠాకూర్ సోయగానికి ఫిదా అవ్వాల్సిందే. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ వన్ ఆఫ్ ది లీడింగ్ బ్యూటీ తాజాగా బ్లాక్ ఔట్‌ఫిట్‌లో అదరగొట్టేసింది. మృణాళ్ తారక దిగొస్తుందా..? అన్నట్టుగా క్యారవాన్ నుంచి బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో నడుచుకుంటూ వస్తున్న విజువల్స్ ఇప్పుడు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. మృణాళ్ ఠాకూర్ ప్రస్తుతం కామెడీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న హిందీ మూవీ ఆంక్ మిచోలి. పరేశ్ రావల్, అభిమన్యు దస్సానీ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ అక్టోబర్ 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఇలా దర్శనమిచ్చింది మృణాళ్ ఠాకూర్. అందానికే అసూయ పుట్టేలా ఉన్న మృణాళ్ ఠాకూర్ సోయగాలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Nava Telangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godhavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar. 505001, Telangana. Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2017/73893. E-mail Id: editor@manamnews.com.